విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

ఆదివారం 13 ఏప్రిల్ 2025 8 పేజీలు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ☞ ఎండుతున్న పండ్ల తోటలు
- ☞ రైతుకు దక్కని మద్దతు ధర
- ☞ వెలిగొండ ప్రాజెక్టు కోసం రైతుల ఎదురు చూపులు
- ☞ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : దిగజారి పోతున్న భూగర్భ జలాలు, ఎండుతున్న పంట తోటలు, రైతులకు దక్కని మద్దతు ధర, వెలుగొండ ప్రాజెక్టు కోసం రైతులు ఎదురుచూస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు. యర్రగొండపాలెం మండలంలోని వీరాయిపాలెం, సాయిబాబా నగర్ తదితర గ్రామాలలో రైతులు యొక్క పరిస్థితిని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి వర్గం పరిశీలించారు. రైతుల యొక్క పరిస్థితి వారు పండించే పంటలు, భూగర్భ జలాలు ఎంత లోతుకు పడిపోయాయి. భూగర్భ జలాలను పంటలకు ఎలా అందిస్తున్నారు, ఒక్కొక్క రైతు ఎన్ని బోర్లు వేశారు, వాటిల్లో ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతు సంఘం ప్రతినిధి వర్గం ఈ గ్రామాలలో ఉన్న రైతులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపి ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కరువు చాలా తీవ్రంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో గతంలో రైతులు నిమ్మ, బొప్పాయి, బత్తాయి, అరటి, దానిమ్మ తదితర పంటలు సాగు చేశారన్నారు. కొందరు రైతులు ఈ కరువు పరిస్థితులను అధిగమించడానికి పదుల సంఖ్యలో బోరుబావులు తవ్వించారన్నారు. కొందరు రైతులు తెనాలి, అద్దంకి, పర్చూరు తదితర ప్రాంతాల్లో ఉన్న భూమిని అమ్ముకుని, యర్రగొండపాలెం ప్రాంతంలో భూములను కొనుక్కొని సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు చాలా దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కొందరు మళ్లీ ఈ ప్రాంతంలో ఉన్న భూములను అమ్ముకొని వాళ్ళ సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. రైతులు ఈ ప్రాంతంలో భూములు కొని బోరు బావిలు తవ్వించినప్పుడు 200 అడుగులలో నీళ్లు పడ్డాయి. ప్రస్తుతం 1000 నుంచి 1200 అడుగులు తొవ్విన నీళ్లు పడటం లేదు. ఒక్కొక రైతు ఐదు నుంచి పది బోర్లు దాకా తవ్వించారన్నారు. ప్రతి సంవత్సరం వేసవి కాలం వచ్చే సమయానికి ఈ ప్రాంత రైతులకు ఒక యజ్ఞం లాగా మారుతుందన్నారు. సమీప ప్రాంత గ్రామాల నుంచి రెండు కిలోమీటర్ల మేర పైపులు పరుచుకొని

మిగతా 2 లో ...

వక్ఫ్ చట్ట సవరణలను ఉపసంహరించాలి

సీపీఐ ఒంగోలు నగర సమితి డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: వక్ఫ్ చట్టానికి చేసిన 14 సవరణలను వెంటనే ఉపసంహరించాలని ముస్లిం మైనారిటీల పట్ల కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను విడనాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు డిమాండ్ చేశారు. యూపీఏ అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత 11 సంవత్సరాలుగా ముస్లిం మైనారిటీ వర్గాన్ని తీవ్ర ఇబ్బంది లు పెట్టుతూ వారిని శత్రువులుగా భావిస్తూ వారిపట్ల కేంద్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తుందని వారి ఆస్తులను ప్రభుత్వ కైవసం చేసుకోవ డానికి మోడీ ప్రభుత్వం అమానుషంగా చట్ట సవరణలు చేసిందని ముమ్ముందు క్రిస్టియన్ సంస్థల ఆస్తులు హస్తగతం చేసుకోవడానికి అంతి మంగా హిందూ మత ఆస్తులను సైతం స్వాహా చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించే దిశగా యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సిపిఐ నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ ధర్నాలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు కేంద్ర తప్పుడు నిర్ణయాలకు టీడీపీ, వైస్సార్ పార్టీలు వంతపాడటం దుర్మార్గమన్నారు.సీపీఐ సీనియర్ నాయకులు మాజీ నగర కార్యదర్శి ప్రకాశం మాట్లాడుతూ సీపీఐ మైనారిటీలకు, బీసీ,ఎస్సి,ఎస్టీలకుఅండగానిలుస్తుందన్నారు. రైతుసంఘం కార్యదర్శి హనుమారెడ్డి ముస్లింలు ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని సీపీఐ మద్దతుగానిలుస్తుందని చెప్పారు. కారుమూడి నాగేశ్వర రావు,లక్ష్మయ్య, పోలేరయ్య, ఏ వై రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి

- ◆ అక్రమ మైనింగుకు అడ్డుకట్ట వేయండి
- ◆ ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

విశాలాంధ్ర-ఒంగోలు: తాతల నుండి వారసత్వంగా సంక్రమించిన తమ భూములను ఆక్రమణ దారుల చెర నుండి విడిపించాలని, అదేవిధంగా ఆ భూములలో జరుగుతున్న అక్రమ మైనింగ్ ను వెంటనే నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఒంగోలు మండలం సర్వే రెడ్డి

మిగతా 2 లో ...

వేసవి పూర్తయ్యే నాటికి అందుబాటులోకి పంట కాలువలు

- ఇసుక దోపిడీ కోసమే గుండ్లకమ్మ గేట్లు విరగొట్టారు
- గుండ్లకమ్మలో మూడు టీఎంసీల నీటి నిలువ
- 20 లక్షల చేప పిల్లలతో ఎందరికో జీవనాధారం
- సాగునీటి సంఘాలు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - బల్లికురవ : వేసవి కాలం పూర్తయి,వ్యవసాయ సీజన్ వచ్చే నాటికి పంట కాలువలకు పూడికతీతలు,మరమత్తుల పనులు పూర్తి అయ్యేలా చూసి రైతులకు అందుబాటులోకి తేవాలని సాగునీటి సంఘాల అధ్యక్షులు,సభ్యులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిశా నిర్దేశం చేశారు. బల్లికురవ మండలం నక్కబొక్కలపాడు గ్రామంలో శనివారం జరిగిన ఈర్ల గంగమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్షులు,సభ్యులతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేద్యం ప్రారంభించే సమయానికి అన్నదాతకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పంట కాలువలను అందుబాటులోకి తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సాగునీటి సంఘాల సభ్యులకు స్పష్టం చేశారు. గుండ్లకమ్మ చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు రైతాంగాన్నీ కాపాడుకుంటామని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ కోసమే గుండ్లకమ్మ గేట్లను విరగొట్టారని విమర్శించారు. ప్రజలు,రైతుల బాధలు పట్టించుకోని వైసీపీ నేతలు గుండ్లకమ్మలో నీరు లేకుండా చేసి కోట్లాది రూపాయిల విలువైన ఇసు కను దోపిడీ చేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గుండ్ల కమ్మ మరమత్తుల కోసం నిధులు కేటాయించిందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ మరమత్తులు పూర్తి చేసి యుద్ధ ప్రాతిపదికన గేట్లు పెట్టించిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అదే విధంగా మూడు టీఎంసీల నీటిని నిలువ చేయ డంతో పాటు అందులో 20 లక్షల చేప పిల్లలనూ గుండ్లకమ్మలో వదిలా మని వివరించారు. దీని ద్వారా జలాశయం మీద ఆధారపడి జీవించే వారికి జీవనోపాధి కల్పిస్తున్నామని వెల్లడించారు. అదే విధంగా కాలువల మరమత్తులు,పూడికతీత పనులు పూర్తయ్యే వరకు నీటి సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. పలువురు కూటమి నేతలు, సాగునీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గోవులపై వైసీపీ విష రాజకీయం

- ❑ టీటీడీ ప్రతిష్టకు భంగం కల్గిస్తే సహించేది లేదు
- ❑ తప్పుడు ప్రచారాలు మానుకోవాలి
- ❑ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడి

విశాలాంధ్ర - యద్దనపూడి : పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో గోవులపై వైసీపీ విష రాజకీయానికి తెరలేపి రాక్షస ఆనందం పొందుతూ మతవిద్వేషాలు రెచ్చగొట్టే కుట్రకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని తెలుగుదేశంపార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. టీటీడీ గోవులు మరణించాయంటూ వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారంపై ఎమ్మెల్యే ఏలూరి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేత భూమన కరుణాలకరరెడ్డి వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కలోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అదో నల్లరాయి దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

మిగతా 2 లో ...

మా భూమి మాకు ఇప్పించండి

మొదటి పేజీ తరువాయి

పాలెం గ్రామానికి చెందిన దళిత రైతులు కోరారు. ఒంగోలు ఎంసీఏ భవన్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బాధిత దళిత రైతు దాసరి సుధాకర్ రావు మాట్లాడుతూ తమ తాతల ద్వారా సర్వే రెడ్డి పాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 197/1, 197/2, 197/3 లలో 5 ఎకరాల 47 సెంట్ల డీకే భూమి తమ కుటుంబీకులకు వారసత్వంగా వచ్చిందన్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులు తమ భూమిని ఆక్రమించారన్నారు. గత 12 సంవత్సరాల నుండి తమ భూమి కోసం పోరాటం చేస్తున్న పట్టించుకున్న నాథుడు కరువయ్యారన్నారు. డీకే పట్టా, పాస్ పుస్తకం, ఆన్లైన్లో కూడా తమ పేర్లు ఉన్నాయని, అయినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములు తమకు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దళిత రైతుల భూములతో పాటుగా గ్రామంలోని ఇతర రైతుల భూములలో కూడా మైనింగ్ అక్రమ రవాణా చేస్తూ పొలాల్లోకి రానీయకుండా దౌర్జన్యం చేస్తున్న వారిపై జిల్లా అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మమ్మల్ని భూమిలోకి రానీయకుండా అక్రమంగా మైనింగ్ లారీలు ద్వారా తరలిస్తూ అడ్డొస్తే లారీలు కింద తొక్కిస్తామని కొందరు బెదిరిస్తున్నారు అన్నారు. ఇటీవల ప్రభుత్వం రీ సర్వే చేసినప్పుడు కూడా ఆ భూములు తమవిగా రికార్డులు తేలిందని అన్నారు. జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామని రెవెన్యూ అధికారులు ఫిర్యాదు పట్టించుకోవటం లేదని అన్నారు. జిల్లా పోలీసు అధికారి కూడా వినతిపత్రం సమర్పించామని అయినా ఫలితం రాలేదని అన్నారు. దళితుల భూములను అక్రమంగా ఆక్రమించుకొని మైనింగ్ రవాణా చేస్తుంటే రైతుల భూములు కూడా నష్టపోతున్నామని మక్కిని వెంకటేశ్వర్లు అనే రైతు తన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకొని మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎల్లావుల అంకమ్మ, అడ్డగిరి లక్ష్మి ఉన్నారు.

గోవులపై వైసీపీ విష రాజకీయం

అలజడి సృష్టించేందుకు,ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేయడం దుర్మార్గం అన్నారు.

- గోమరణాలపై తప్పుడు ప్రచారం : గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవం అన్నారు.గోశాలలోని ఆవులు వృద్ధాప్యం,డెలివరీ సమయంలో వ్యాధులతో నెలకు సగటున 10 ఆవుల వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు.ఇవి గత అయిదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టమవుతుందన్నారు.గడిచిన మూడు నెలల్లో వృద్ధాప్యం,వ్యాధులు వంటి కారణాలతో ఇప్పటివరకు 40 ఆవులు మృత్యువాత పడడం జరిగిందన్నారు.కానీ కరుణాకర రెడ్డి ప్రెస్ మీట్లో చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫోటోలు ఇక్కడివి కాదు, ఎక్కడివో వాటిని అడ్డుపెట్టుకుని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

- టీటీడీ పర్యవేక్షణ పై తప్పుడు ప్రచారం : గోసంరక్షణ శాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్షించడం జరుగుతుందన్నారు.టీటీడీ గోశాలలో 260 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

- జియో ట్యాగింగ్ పై,మరణాలపై అబద్దాలు : గోశాలలోని 2,668 ఆవులకు జియో ట్యాగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షించడం జరుగుతుంటే ఆవులకు జియోట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదన్నారు.గోశాలను గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ గోశాలలను శుభ్రపరచడం,బ్లీచింగ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గోశాలను సందర్శించిన భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తుంటే ఇక్కడ పరిశుభ్రత లేదంటూ తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు.

- **నాస్తికుడు కరుణాకర్ రెడ్డి** : నేను నాస్తికుడినని స్వయంగా కరుణాకరరెడ్డి ప్రకటించుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామిదేముంది,ఒక నల్ల రాయి,దానిని పెకిలించేస్తానంటూ గతంలో ప్రకటించలేదా అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్ గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీల కుంభకోణం,తాళిబొట్ల కుంభకోణం,టిక్కెట్లు అమ్ముకోవడం,డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడలేదా అన్నారు.కోవిడ్ సమయంలో స్వామి వారి ప్రసాదాలను కూడా దారిమళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకరరెడ్డిది కాదా అన్నారు.కరుణాకరరెడ్డి కుమార్తె నిహారెడ్డి పెళ్లిని క్రైస్తవ మత ఆచారాలతో చేసిన మాట వాస్తవం కాదా,కరుణాకరరెడ్డి అవినీతి,అక్రమాలతో టీటీడీ ఖజానాను దారిమళ్ళించి కమిషన్లు కొట్టేశారని మండిపడ్డారు.తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, ఏడుకొండలను 5 కొడలుగా మార్చి కుట్ర చేసింది,టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్ గా మార్చే చర్యలకు పాల్పడింది నువ్వు కాదా అన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

మొదటి పేజీ తరువాయి

నీళ్ళు కొనుక్కొని మొక్కలను బతికిస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించలేదని ఆయన విమర్శించారు. ఒకవేళ కరువు మండలంగా ప్రకటించిన ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు అందటం లేదన్నారు. ఏ పంట వేసిన సరైన మద్దతు ధర లేక రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మండుకొట్టుటకు కూలీల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని అన్నారు. కౌలు చేసుకునే రైతుల పరిస్థితి ఇంకా దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం ఈ మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించి, రైతులకు నీటి రవాణా ఖర్చును ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి రవాణా ఖర్చుల్లో ప్రభుత్వం సగభాగం భరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించడానికి అధికారులతో సమావేశాలేసి రైతుల ఇబ్బందులను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో రైతులు వేసుకున్న పంటలు బతకాలంటే పులసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కావాలని ఆయన తెలిపారు. 1996లో చంద్రబాబు నాయుడు ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు ముందుకుపోయిన పాపాన పోలేదన్నారు. ఇప్పుడు కూడా వెలుగొండ ప్రాజెక్టుకు నమ్మకంగా నిధులు ఇస్తే ఎలా పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ఇటీవల మార్కాపురం వచ్చిన సందర్భంలో ఈ ప్రాజెక్టు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఇంకా ఎంతకాలం ప్రాజెక్టు కోసం వేచి ఉండాలని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాంతంలోని ప్రజల దాహార్తిని తీర్చడానికి తక్షణమే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి త్రాగు, సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టీసీఎచ్ చెన్నయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బాణాల రామయ్య, మన్నె సాంబశివరావు, సీపీఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య, రైతులు అంగిరేకుల చంద్రశేఖర్, అంగిరేకుల వెంకటరావు, మువ్వ చక్రవర్తి, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ ఫలితాలలో శ్రీహర్షిణి విద్యార్థుల విజయదుందుభి

విశాలాంధ్ర-ఒంగోలు: ఇంటర్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలలో శ్రీ హర్షిణి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ పరంపర కొనసాగించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగం నందు బత్తుల ధరణి 470 మార్కులకు 466 మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఎస్.భార్గవి , పి.లక్ష్మీనారాయణ పి.హృదయ బాబు 465 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్ బైపిసి నందు జి.ఉజ్వల హర్షిణి 440 మార్కులు లకు గాను 431 మార్కులతో ప్రథమ స్థానం పొందినది. ఎంఈసి విభాగం నందు 500 మార్కులకు 467 మార్కులు, సీఈసీ విభాగం నందు 500 మార్కులకు 465 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందారు.సీనియర్ ఇంటర్లో ఎంపీసీ విభాగం నందు అడక మధు కిరణ్ 1000 మార్కులకు గాను 988 మార్కులు, ఎస్.కె షీరున్నీష 988 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందారు. వి.జాన్ తేజ, యు.శ్రావణి 986 మార్కులు సాధించి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. బైపీసీ విభాగం నందు కటారి హారిక 973 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంఇసి విభాగం నందు సుహాస 953 మార్కులు సిఇసి విభాగం నందు సింగమశెట్టి సాయి దుర్గ 959 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందారు. జూనియర్ ఇంటర్ నందు 460 పైగా 39 మంది, 400 పైగా 281 మంది మరియు సీనియర్ ఇంటర్ నందు 980 పైగా 18 మంది 900 పైగా 300 విద్యార్థులు విజయం సాధించారు. ఈ సందర్భంగా పురస్కరించుకుని కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ గారు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత గారు ,మరియు కళాశాలల డీన్ దాది ఆంజనేయులు, అకాడమిక్ డీన్ కరణం నారాయణ,ప్రిన్సిపాల్స్ దివి రమేష్, ఎం. ఏడుకొండలు,ఎ ఒ నంబూరి శ్రీనివాసరావు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభ హల్‌చల్



విశాలాంధ్ర-ఒంగోలు: ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులతో హల్చల్ చేశారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ భాగంలో గోట్ల శృతి, చిమ్మిరి స్నేహ 990 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే కుమ్మర వెంకట కళ్యాణ్ రామ్ 989 మార్కులు, తుమ్మలూరు మౌనిక, శెట్టి పూజిత లు 988మార్కులు, చిన్నపరెడ్డి వెంకట త్రిష, అద్దంకి వంశీ, కుర్ర వెంకట మహాలక్ష్మి లు 987 మార్కులు, పోతు విష్ణు, అట్లా వెంకట ప్రసాద్, మల్లెల తులసీలు 986 మార్కులు, వెంకట నాగ సాయి యశోవర్ధన్, కంట జస్వంత్ లు 985 మార్కులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో వెలుగు హాసిని వెయ్యి మార్కులు కాను 987 మార్కులు, దొండపాటి స్నేహ రెడ్డి 981 మార్కులు సాధించారు. అలాగే బైపిసి భాగంలో దేవండ్ల పూజిత 470 మార్కులు గాను 433 మార్కులు, దాసరి వైశాలి 430 మార్కులు, పిన్నిక సంతోషిని 429 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూని జయప్రకాష్ నారాయణ అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో శ్రీ సరస్వతి ప్రభంజనం

విశాలాంధ్ర-ఒంగోలు: ఇంటర్ ఫలితాలలో శ్రీ సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనాన్ని సృష్టించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులు గాను 466 మార్కులు 9 మంది విద్యార్థులు సాధించగా, 465 మార్కులను 25 మంది విద్యార్థులు, 464 మార్కులను 32 మంది విద్యార్థులు, 460 పైగా మార్కులను 219 మంది విద్యార్థులు సాధించారు. అలాగే జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులు గాను 435 మార్కులు నలుగురు, 434 మార్కులను నలుగురు, 433 మార్కులను ముగ్గురు, 420 పైగా మార్కులను 22 మంది విద్యార్థులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 991 మార్కులు ముగ్గురు విద్యార్థులు, 990 మార్కులను నలుగురు విద్యార్థులు, 989 మార్కులను 9 మంది విద్యార్థులు, 980 పైగా మార్కులను 120 మంది విద్యార్థులు సాధించారు. శ్రీ సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏవి రమణారెడ్డి, డైరెక్టర్లు గణేష్ రెడ్డి, గంగా శంకర్ రెడ్డి, సీఈవో ఎన్ వి సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్, విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో ఎస్ఎస్ఎన్ హవా

విశాలాంధ్ర-ఒంగోలు: ఇంటర్మీడియట్ 2025 పరీక్ష ఫలితాలలో ఒంగోలు మంగమూరు రోడ్డు లోని ఎస్ ఎస్ ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ హవా కొనసాగించినట్లు ఎస్ ఎస్ ఎన్ విద్యాసంస్థల చైర్మన్ ఎల్లటూరి రామ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎన్ సవిని, పి జోషిత లు 470 మార్కులు గాను 465 సాధించి తమ సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎల్లటూరి రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ వై శివానందరెడ్డి, డీన్ ఎం జమర్ధన రెడ్డి అధ్యాపక బృందం అభినందించారు.

శ్రీ గౌతమి హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం వంటి వెనుకబడిన ప్రాంతానికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్న శ్రీ గౌతమి విద్యా సంస్థలు విద్యాభివృద్ధికి కొత్త దిక్సూచి అవుతున్నాయని గౌతమి విద్యా సంస్థల అధినేత కనుమర్ల గుండా రెడ్డి అన్నారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్ నందు గ్రాడ్యుయేషన్, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజం మారుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడాలి అన్నదే నా కల అని చెప్పారు. అందుకే 13 ఏళ్ల క్రితం యర్రగొండపాలెంలో జూనియర్ కళాశాలను స్థాపించినట్లు తెలిపారు. అనంతరం డిగ్రీ కళాశాల కూడా ప్రారంభించామన్నారు. గత ఏడాది హై స్కూల్ కూడా స్థాపించి 170 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించగలిగామని చెప్పారు.

తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న శ్రీ గౌతమి హై స్కూల్లో తమ పిల్లలను చేర్పించుకోవాలని ఆయన సూచించారు. పేదరికాన్ని అరికట్టే శక్తి విద్యదేనని, విద్యార్థులు అందరికంటే ముందుండాలంటే మంచి విద్య అవసరమని ఆయన స్పష్టం చేశారు. శ్రీ గౌతమి విద్యా సంస్థలు యర్రగొండపాలెం విద్యారంగంలో మార్పుకు నిలయంగా మారాయన్నారు. తక్కువ వ్యయంతో, ఆధునాతన విద్యా విధానాలను అందిస్తూ విద్యలో సమానత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా తమ సంస్థ ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. ఎంఇఒ పి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమ శిక్షణతో ఉండడం అభినందనీయమన్నారు. చక్కగా చదువుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సభకు శ్రీ గౌతమి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుంటక త్రిపురారెడ్డి అధ్యక్షత వహించారు. ఇంకా శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిబాబు, సీనియర్ జర్నలిస్టు షేక్ వలీసాహెబ్ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులకు పై తరగతులకు ప్రమోట్ చేస్తూ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి విద్యా సంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఆల్ ఇండియా కిసాన్ సభ

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఆల్ ఇండియా కిసాన్ సభ రైతులకు అండగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం యర్రగొండపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 90 సంవత్సరాల నాడు ఏర్పడిన కిసాన్ సభ రైతుల పక్షాన అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. రైతు పండించిన పంటలకు మద్దతు ధర ఇప్పించడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించడంలో ఆల్ ఇండియా కిసాన్ సభ, రైతు సంఘాలు రైతుల పక్షాన పాలకులపై అనేక పోరాటాలు చేశాయన్నారు. తొలుత రైతు సంఘం జెండాను రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టీసీఎచ్ చెన్నయ్య, కృష్ణ గౌడ్, సాంబశివరావు, వెంకట శివయ్య, విశ్వరూచారి, నక్కా తిరుపతయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-వెలిగండ్ల : పోలేరమ్మ తిరునాళ్లను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వెలిగండ్ల ఏఎస్ఐ షేక్ జిలానీ భాష సూచించారు. శనివారం మండలంలోని వెలిగండ్ల పోలేరమ్మ గుడిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారితో మాట్లాడుతూ తిరునాళ్ల ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని శాంతి భద్రతలకు విఘాతం కల్గించకూడదని అటువంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. వాహనాలు పార్కింగ్ అవుట్ పోస్ట్ సంబంధించి స్థలాలను పరిశీలించారు. హెడ్ కానిస్టేబుల్ అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు గోపాలకృష్ణ యాదవ సంఘం అన్న వితరణ

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని జేపీ చెరువుకు సమీపమున అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ నెమలిగుండ్ల రంగనాయక క్షేత్రాన్ని బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు విద్యుత్ దీపాలతో అలంకరించి బ్రహ్మోత్సవాల శోభ సంతరించుకునేలా సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు శ్రీ గోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రం అధ్యక్షులు వేల్పుల పెద్ద రాజయ్య ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు శనివారం ఆదివారం సోమవారం అన్న వితరణ వసతి కల్పిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో విశాలాంధ్ర విలేఖరికి తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ గోవిందరాజులు సెక్రటరీ

దాకాల కోటయ్య పెద్ద గోపాల్ ట్రెజరర్ వేల్పుల పెద్ద గోపాల్ పాపయ్య ఆధ్వర్యంలో భోజనాలు భక్తులకు ఏర్పాటు చేయటం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్ర రాజయ్య కాకర్ల ప్రసాదు వెంకటేశ్వర్లు రంగయ్య సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరులో ఈదురు గాలులు బీభత్సం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలో శనివారం వర్షం గాలుల బీభత్సంతో చెట్లు పడిపోయాయి. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అనుకోకుండా అకాలంగా ఒక్కసారిగా గాలితో కూడిన వర్షం రావటంతో చెట్లు, ఇంటిపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర గాలి బీభత్సంకు చెట్లు కొమ్మలు తెగి ద్విచక్ర వాహనాల మీద పడ్డాయి. అలాగే బస్టాండ్ సమీపంలో చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలి పోయాయి. వేగంతో గాలులు వీచటంతో బ్యారనీ దగ్గర పొగాకు, పంట పొలాల్లో ఆరబోసి ఉన్న మిరప ఈ గాలి వాన దెబ్బకు దెబ్బతిన్నాయి.

పాల కేంద్రాల్లో ఎస్సై తనిఖీ

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలోని పలు పాల కేంద్రాలను ఎస్సై మల్లికార్జునరావు తన సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాల కల్తీ పై వస్తున్న కథనాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దర్శి సీఐ రామారావు శుక్రవారం తనిఖీ చేయగా, శనివారం పలు కేంద్రాలను తన సిబ్బందితో ఎస్సై తనిఖీ నిర్వహించారు.

షంషీర్ ఆలీ బేగ్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-మార్కాపురం : వేసవి కాలంలో ప్రజల దహార్తిని తీర్చేందుకు షంషీర్ ఆలీ బేగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి అన్నా రాంబాబు అన్నారు. డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కోర్టు సెంటర్లో మినరల్ ఉచిత చలివేంద్రాన్ని అన్నా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో సామాజిక దృక్పథంతో ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించి విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు మరోవైపు వేసవి కాలంలో ప్రజల దహార్తిని తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. షంషీర్ అలీ బేగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర

ఇంటలెక్చువల్ ఫోరం సెక్రెటరీ మేడ బద్రీనాథ్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న షంషీర్ అలీబేగ్ సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె ఇస్మాయిల్, బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సి హెచ్ కనకదుర్గ, షమ్ ఉల్ -ఉలం కాలేజీ చైర్మన్ మీర్జా జాఫర్ అలీ బేగ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోలమారు శ్రీనివాస రెడ్డి,డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాష, వైసిపి నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, బచ్చు జనార్ధన్, బొగ్గరపు శేషయ్య, చిటిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ గౌతమీ విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో యర్రగొండపాలెం శ్రీ గౌతమీ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. రెండవ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగం నందు 1000 కి 982 మార్కులతో గుడిపాటి బన్నీ పట్టణ ప్రథమ స్థానం, 977 మార్కులతో వి. శశి రేఖ, 971 మార్కులతో సీఎచ్ వాసంతి, ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగం నందు 470కి 455 మార్కులతో పట్టణ రెండవ స్థానం టి. వెంకట నరేంద్ర, 449 మార్కులతో జి. ధనుష్, 445 మార్కులతో పి. చైతన్య కుమార్ అను విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ కనుమర్ల గుండా రెడ్డి, ప్రిన్సిపాల్ త్రిపురరెడ్డి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అమెరికా నుంచి స్వదేశానికి కందుల,కూనం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఇటీవల అమెరికా వెళ్లి పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆముదాలవలస ఎమ్మెల్యే కూనం రవికుమార్ లను శనివారం హైదరాబాదులోని విమానాశ్రయం వద్ద రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కామసాని రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో గోగు మహాలక్ష్మి 1000 మార్కులకు గాను 971 మార్కులు సాధించి హై స్కూల్ ప్లస్ లలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 962 మార్కులు సాధించిన కాసగారి రేవతి సి. ఎస్. పురం మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంపీసీ విభాగంలో 911 మార్కులు సాధించి జొన్నలగడ్డ జ్యోతి మండల స్థాయి ద్వితీయ స్థానాన్ని, 822, 805 మార్కులు సాధించిన వాకా సాయి కీర్తన, లక్ష్మీ పోగు అజిత కళాశాల స్థాయిలో వరుసగా మూడు, నాలుగు స్థానాలలో నిలిచారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నాగినేని తిరు పతయ్య, ఎస్.ఎం.సి చైర్మన్ మూరం మస్తానయ్య, డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు, అధ్యాపక బృందం అభినందించారు.

'రంగుల' సమ్మర్ క్యాంప్ బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు: రంగుల ఆర్ట్ గ్యాలరీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న "రంగుల సమ్మర్ క్యాంప్" బ్రోచర్ ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సతీమణి దామచర్ల నాగసత్యలత ఆవిష్కరించారు.ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు ఉపయోగపడే చిత్రకళలు, సంగీతం, డాన్స్ మరియు హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ నేర్పించడం జరుగుతుందని నిర్వాహకురాలు రంగుల సంధ్య తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రతి తల్లిదండ్రులు వారి వారి పిల్లలను సమ్మర్ క్యాంపులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.దామచర్ల నాగసత్యలత మాట్లాడుతూ రంగుల ఆర్ట్ గ్యాలరీ వారి సమ్మర్ క్యాంప్ ద్వారా పిల్లలకు అన్ని విధాల ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గతంలో తమ ఇద్దరు పిల్లలు కూడా రంగుల ఆర్ట్ గ్యాలరీలో డ్రాయింగ్ నేర్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రంగుల ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకురాలు రంగుల సంధ్య, మహిళా చిత్రకారిణి వేల్పూరి రాధా మరియు సంధ్యారాణి పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు చరణ్ తేజ ఎంపిక

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరి బాబురావు ఉద్యాన కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ తేజ ఇటీవల ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో రాణించి మే నెలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో జరిగే జాతీయ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. మే నెల రెండవ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఉద్యాన విశ్వవిద్యాలయం తరపున చరణ్ పాల్గొంటాడు. శనివారం చరణ్ తేజను సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అభినందించి జాతీయ స్థాయి క్రీడలలో రాణించి కళాశాలకు పేరు తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత, ఉప సర్పంచ్ టి బాబురావు, డి మాలకొండయ్య, రమణయ్య, రహిమాన్, ఖాసీం భాష, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ గురుకులంలో 75శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె పంచాయితీలో గల వెలుగొండ గురుకుల కళాశాలలో శనివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 75శాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో మొత్తం 32 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 24 మంది పాసయి 8 మంది ఫెయిలయ్యారని, ఇంటర్ మొదటి సంవత్సరంలో 44 మంది పరీక్షలు కు హాజరుకాగా 21 మంది పాసై 23 మంది ఫెయిలయ్యారని, సీనియర్ ఇంటర్లో పి రవి తేజకు ఎంపీసీలో 1000 మార్కులకు 907 మార్కులు సాధించారని ఏ సిద్ధార్థ బైపీసీ విద్యార్థికి 916 మార్కులు సాధించడం జరిగిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో వికే ప్రభుత్వ కళాశాల విజయకేతనం

విశాలాంధ్ర - తాళ్లూరు: ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాలలో వికే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 94శాతం మంది, ప్రథమ సంవత్సరంలో 60 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరంలో ఈఈటీ కి చెందిన ఎ భాగ్య లక్ష్మి (966), సీఈసీ కి చెందిన జీ లీకన్య (846) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఈఈటీ కి చెందిన షేక్ సహానా (462), సీఈసీ కి చెందిన జి అఖిల (452) సాధించి ప్రతిభచాటారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించాలి

- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్

విశాలాంధ్ర - ఒంగోలు టౌన్ : అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో నిర్వహించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి ఎన్ లక్ష్మా నాయక్ ఒక ప్రకటనలో కోరారు.

భానుడి ప్రతాపం

విశాలాంధ్ర-ముండ్లమూరు : భానుడు ప్రతాపం చూపుతున్నాడు. గత పది రోజుల నుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వడగాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. అత్యవసరమైతే బయటకు వస్తున్నారు. ఉదయం 11 నుండి 12 గంటల లోపు పనులు ముగించుకొని ప్రజలు ఇళ్లకు చేరుతున్నారు. దీంతో ప్రజలు రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులు జన సంచారం లేక వెలవెలబోతున్నాయి.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

సీపీఐ, ఎంపీజే డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : దేశంలో కోట్లాది మంది ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ, ఇన్సాఫ్, ఎంపీజే పార్టీలు శనివారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ ఎన్ డి ఏ ప్రభుత్వం మొదటి నుండి ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే నేడు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు చేసి, వారి ఆస్తులను కాజేందుకు మోడీ సర్కారు కుట్రపన్నిందని నాసరయ్య విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కె ఖాసిం మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని విమర్శించారు. ఎంపీజే రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.కె. అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అమలుపరచడంలో మోడీ ప్రభుత్వం ముందు ఉంటుందని విమర్శించారు. అందులో భాగంగానే నేడు దేశమంతా తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నప్పటికీ ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం తీసుకొని వచ్చిందని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వ తిరోగమున విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె అబ్దుల్ రజాక్ ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, పార్టీ నాయకులు దుప్పట్ల కాశయ్య, శేఖర్, ఎంపిజే నాయకులు ఎస్.కె రసూల్, మదీనా మసీదు ముత్తవల్లి షేక్ కరీముల్లా, గఫూర్, సీఎం ఖాసీం,ఎర్ర ఖాసీంలు పాల్గొన్నారు.

నేడు విఠలాపురంలో

వైకుంఠ రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం

విశాలాంధ్ర - తాళ్లూరు: తాళ్లూరు మండలంలోని విఠలాపురంలో రూ. 2కోట్ల రూపాయల నిర్మించిన రామాలయంను ఈనెల 13వ తేదీ ప్రతిష్ఠించనున్నారు. విఠలాపురం కాలనీ ఏర్పాటు సమయంలో నాలుగు అడుగుల ఎత్తులో గుడి నిర్మించి రాములవారి శిలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. వివాహాల సమయంలో దేవునికి ఎదురు నడిస్తూ ఆలయం వద్ద పూజలు చేయటం, శ్రీరామనవమి వేడుకలు జరపటం ఆనవాయితీ. ఆచిన్న విగ్రహం స్థానే రామాలయం నిర్మించాలని తలంచి ఐదేళ్ల క్రితం భూమి పూజ చేశారు. ప్రభుత్వ సహకారంతో సీజీఎఫ్ కింద రూ.16లక్షలు మంజూరు కాగా గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.50 లక్షలు సమకూర్చి రామాలయ నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయ గర్భగుడి, శిఖరం వరకు రాతి కట్టడం తో నిర్మించారు. ఆలయ ప్రహరీగోడ చుట్టూ రామాయణ కథ భక్తులకు అర్థమయ్యే రీతిగా రాములవారి జీవిత విశేషాలు తెలిసే రీతిగా పలుచిత్రాలను చిత్రీకరించారు. అన్ని హంగులతో ఆలయనిర్మాణం చేపట్టి దాతలు, ప్రభుత్వ సహకారంతో రూ.50లక్షలు సమకాగా మిగిలిన కోటిన్నర రూపాయలను గ్రామవాసి మారం సుబ్బరాయుడు కుమారుడు యుఎస్ఏలో వ్యాపార దిగ్గజం మారం అంజిరెడ్డి తానే స్వయంగా సమకూర్చాడు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావటంతో ఆదివారం ఆలయప్రతిష్ట దేవతా మూర్తుల విగ్రహ, కలిశ ప్రతిష్ట కార్యక్రమానికి ఏర్పాటు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడునని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని కోరారు.

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్టెలు: ఏపీడీ

విశాలాంధ్ర-పామూరు : వేసవి కాలంలో మూగజీవుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టినట్లు ఉపాధి పనులు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కరరావు అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఐ టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మార్నేని రామకృష్ణతో కలిసి నీటి తొట్టెల నిర్మాణమునకు భాస్కరరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులు, రైతులు ఈ అవకాశాన్ని అద్వినియోగించుకోవాలని పోయారు. కార్యక్రమంలో ఏపీవో మాల్యాద్రి, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, తేజ, శ్రీను, మాజీ సర్పంచ్ మార్నేని మాలకొండయ్య, మార్నేని రామకృష్ణ, బాను శ్రీనివాసులురెడ్డి, మన్నం శ్రీనివాసులు, చీమలదిన్నె సుబ్బయ్య, జింక మధు, యాకోబు పాల్గొన్నారు.

కిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-కనిగిరి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐ-టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కనిగిరి నియోజకవర్గ వైయస్సార్ సీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్లో దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్, జడ్పీటీసీ కస్తూరి రెడ్డి, లక్ష్మీ కాంతం, పులి శాంతి, తమ్మినేని సుజాత, ఆదినారాయణ రెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, కటికల వెంకటరత్నం స్థానిక పోలీస్ స్టేషన్ కు ఊరేగింపుగా వెళ్లి చేబ్రోలు కిరణ్ పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ ఖాజావలికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం : ఏఎంసీ చైర్మన్ యారవ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు బాలింతలకు, గర్భిణీలకు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం అందించి అంగన్వాడి కేంద్రాలు బలోపేతం కావాలని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వగ్గంపల్లి ఎస్టీ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం .వి. ఎస్. పార్వతీ ఆధ్వర్యంలో పోషణ పక్వాడలోగాను ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, సర్పంచ్ దేగా సుబ్బ య్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలన్నారు. టీడీపీ నాయకులు బి .వెంకటేశ్వర రెడ్డి ,షేక్. రసూల్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లహరి ప్రాజెక్ట్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-కనిగిరి: నియోజకవర్గ వైయస్సార్ సిపి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ శనివారం ఒంగోలులోని వైసీపీ నాయకులు ముల్లంగి రవీంద్రారెడ్డి, కేశవరెడ్డిల లహరి ప్రాజెక్ట్ రియల్ ఎస్టేట్ ఆఫీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ రిబ్బన్ కటింగ్ చేసి ఆఫీస్‌ను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ సీనియర్ నాయకులు సాన రమణారెడ్డి, సీసీకేఆర్ లక్ష్మణ్ కుమార్ రెడ్డి, లహరి కృప ప్రాజెక్ట్ చైర్పర్సన్ భాస్కర్, మేనేజింగ్ డైరెక్టర్ కేశవరెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గా మహేశ్, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, బాకా శివారెడ్డి, బాగా రమేష్ రెడ్డి, కావేటి రవికుమార్, వేణుగోపాల్, కుండా శ్రీనివాస్ రెడ్డి, మఖాని జయప్రకాష్, దీపు, మెడగం కృష్ణారెడ్డి, షేక్ ఖాలెషావలి, రమణారెడ్డి,జిల్లా మహిళా నాయకురాలు నాగమణి, స్టేట్ సూర్య బలిజ మాజీ కార్పొరేషన్ చైర్పర్సన్ దాసరి కరుణా కర్, టయోటా షోరూం మేనేజర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కేసులు పత్రికా స్వేచ్ఛకు విరుద్ధం

విశాలాంధ్ర - అద్దంకి : జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం పత్రిక స్వేచ్ఛకు విరుద్ధమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు చెన్నుపాటి రాంబాబు అన్నారు.ఓ పత్రిక సంపాదకుపై ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడానికి నిరసిస్తూ శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో అద్దంకిలో జర్నలిస్టులు నిరసన చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ జర్నలి స్టులు ఏదైనా వార్త తప్పుగా రాస్తే వివరణ అడగాలి లేదంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలన్నారు.గత ప్రభుత్వంలో ప్రస్తుత ప్రభుత్వంలో జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం సర్వసాధారణ మైపోయాయన్నారు. జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.జర్నలిస్టులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని కోరుతూ అద్దంకి సీఐ ఆరాధ్యుల సుబ్బరాజుకు వినతి పత్రం సమర్పించారు.కార్యక్రమంలో ప్రింట్,ఎలక్ట్రానిక్ విలేకరులు పాల్గొన్నారు.

నాటు సారా వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : బాపట్ల ప్రొహి బిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.గీతిక అధ్యక్షతన బాపట్ల రూరల్ పరిధిలోని నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బాపట్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల బేతపూడి గ్రామంలో నాటు సారా వల్ల కలిగే అనర్ధాలపై గ్రామ ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఒంగోలు కే.విజయ, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్, ఎన్ఫోర్స్మెంట్, ఒంగోలు ఏ.జనార్ధనరావు,అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్ బాపట్ల బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాటు సారాపై ర్యాలీ నిర్వహించారు. సబ్ ఇన్స్పెక్టర్లు డి.ప్రభుదాస్, ఎస్.మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - వేమూరు : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ యూత్ వేమూరు వారి ఆధ్వర్యంలో శనివారం వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్,సీనియర్స్ విభాగాలకు వేరువేరుగా ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితవిధానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. పోటీలలో గెలుపొందిన వారికి 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా మొదటి బహుమతిగా రూ.3000లు, రెండో బహుమతిగా రూ.2000లు, మూడో బహుమతిగా రూ.1000లు నగదు ప్రోత్సాహాలను అందించడం జరుగుతుందన్నారు.పోటీ పరీక్షల్లో పాల్గొని పరీక్ష రాసిన అభ్యర్థులకు ఆదివారం వారు సాధించిన మార్కులు తెలియపరుస్తామని అంబేద్కర్ యూత్ సభ్యులు తెలియజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి తమ అభినందనలు తెలియజేశారు.

దైవభక్తితో పాటు దేశభక్తి కలిగి ఉండాలి

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరం గ్రామం పూడివాడ రోడ్డులో ఉన్న రామాలయంలో సత్సంగం నిర్వహణ జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు పాల్గొని మాట్లాడుతూ ఉగాది, శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్న హిందూ బంధువులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. అదే విధంగా హిందువులందరూ దైవభక్తితో పాటు దేశభక్తి కూడా కలిగి ఉండాలని హిందూ ధర్మం సనాతనమైనది ధర్మంపై అవగాహన కలిగి ధర్మ రక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఖండ్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, పద్యాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి జూన్14 వరకు వేట నిషేధం

- మత్స్యశాఖ అధికారిణి కౌసర్

విశాలాంధ్ర - రేపల్లె : ఈనెల 15 నుండి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధించబడుతుందని మత్స్యశాఖ అధికారిణి కౌసర్ మత్స్య కారులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సముద్రంలో చేపల సంతానోత్పత్తికి,వాటి సంతతి పెరుగుదలకు సముద్ర మత్స్యసంపదను సుస్థిర పరచుటకు 2025-26 సంవత్సరమునకు ఈనెల 15 నుండి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల వరకు సముద్రంలో యాంత్రిక,మోటారు పడవలచే చేపల వేట నిషేధ కాలమును రాష్ట్ర ప్రభుత్వము అమలు పరచిదని, రేపల్లె మండలంలో నిషేధిత కాలంలో సముద్రంలో మోటారు పడవల వారు వేట చేయకూడద న్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టము 1994 అనుసరించి బోట్ల యజమా నులపై చర్యలు తీసుకొని, వారి బోట్లకు జరిమానా విధించి, బోటులో ఉండే మత్స్య సంపదను స్వాధీన పరచుకోనుటమే కాక, డిజిల్ ఆయిల్ రాయితీ, ప్రభుత్వం అందించే పథకములని నిలుపుదల చేయబడునన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

విశాలాంధ్ర-పర్చూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు పాబోలు ఉదయభాస్కర్ తెలిపారు. కంటిసమస్య ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

విశాలాంధ్ర-మార్టూరు : అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ సందర్భంగా మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఆర్కెస్ట్రాతో భజన కార్యక్రమం నిర్వహించి పడిపూజ అనంతరం భక్తు లకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీమార్టూరు అధ్యక్షులు ఎన్.వి రామారావు జంట, గ్రామాల అయ్యప్ప భక్తులు భారీగా పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సాగర హారతి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల సముద్ర తీరం వాడ రేవు వద్ద ఉన్న శ్రీఆంజనేయ స్వామి విగ్రహం వద్ద సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శివయ్య స్ఫటిక లింగానికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహి ంచి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు,మహిళలకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజు,బందారు జ్వాలా నరసింహం, కారంచేటి నగేష్ కుమార్,అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో గురుకులం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - అద్దంకి : ఇంటర్ ఫలితాలలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గా గాయత్రి తెలిపారు.సీనియర్ ఇంటర్‌లో 62 మందికి 61 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 76 మందికి 75 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 900 పైచిలుకు మార్కులు 16 మంది సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.సంజన 961 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీలో ఏ.స్వరూపరాణి 967 మార్కులు సాధించినట్లు తెలిపారు. 98.6శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ బహుకరణ

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ అధ్వర్యంలో స్థానిక రోటరీ భవన్‌లో శనివారం దివ్యాంగులకు చక్రాల కుర్చీలను రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ ఆర్థిక సహకారంతో మండలంలోని ఏదుబాడు గ్రామానికి చెందిన ముళ్ళపూడి అంకమ్మరావు, సాంబశివరావులకు అందించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కోమటి ఆంజనేయులు, కోట శ్రీని వాసరావు, పంబి సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు పగలగొట్టారు..నిర్మించడం మరిచారు

విశాలాంధ్ర - కర్లపాలెం : రోడ్డు పగల కొట్టారు రహదారిని నిర్మించడం మరి చారని వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని యాజలి నుంచి గుడిపూడి వెళ్లే రోడ్డులో అక్కడ క్కడ గోతులు ఉండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించేందుకు కాంట్రాక్టర్ ఉన్న రోడ్డును నెల క్రితం పగలకొట్టి వదిలేసాడు. అటుగా నిత్యం పొన్నూరు, కాకుమాను వైపు వెళ్లే ద్విచక్రవాహనదారులు బైక్లు అదుపుతప్పి కిందపడి గాయాలు అయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోని పగలకొట్టిన చోట రోడ్డు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కమనీయం స్వామివారి రథోత్సవం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక నల్ల గాంధీ బొమ్మ కూడలి వద్ద ఉన్న శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వర స్వామి వారి 406వ రథోత్స వం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు స్వర్ణ భాస్కర శర్మ స్వామివారి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దేవేరులను రథంపై వేంచేపు చేసి భక్తుల ఓం నమశ్శివాయ ధ్యానాలతో ముందు నడుస్తుండగా చిత్ర,విచిత్ర వేషధారణలతో, సుమంగళ వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.అశేష జనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం కమనీ యంగా పురవీధుల్లో సాగింది.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రామాలయంలో నామన ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని శృంగార పురంలో శ్రీరామ నవమి నవరాత్రులలో భాగంగా అభయ కోదండ రామాలయం కమిటీ వారి ఆహ్వానం మేరకు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ ప్రత్యేక పూజ నిర్వహించారు.అనంతరం అన్నసంతర్పణలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com ఆదివారం 13 । ఏప్రిల్ । 2025

రాష్ట్ర విద్యార్థి విభాగం సెక్రెటరీగా మాచవరపు రవికుమార్

విశాలాంధ్ర - పర్చూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శిగా మాచవరపు రవికుమార్ నిమిత్తులయ్యారు. వైసీపీ అధ్యక్షులు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగంలో నియామకం జరిగింది. గతంలో పర్చూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా నియ మిత్రులయ్యారు. చిన్నగంజాం మండలం గొనసపూడి గ్రామానికి చెందిన మాచవరపు రవికుమార్‌కు బాపట్ల జిల్లా నుంచి విద్యార్థి విభాగంలో స్థానం దక్కింది. రవికుమార్ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, బాపట్ల పార్లమెంటు ఇన్‌ఛార్జ్ నందిగాం సురేష్, పర్చూరు నియోజకవర్గ ఇన్చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విద్యార్థి విభాగం పానుగంటి చైతన్యకు ధన్యవాదాలు తెలియజేశారు.

బాలామృతంపై తల్లులకు అవగాహన

విశాలాంధ్ర - అద్దంకి : పోషణ పక్వాడ పక్షోత్సవా లలో భాగంగా శనివారం పట్టణంలోని సంజీవ నగర్ అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ రమాదేవి తల్లులకు బాలామృతంపై అవగాహన కల్పిం చారు. చిన్నారులకు ప్రతిరోజు 100 గ్రాములు చొప్పున బాలామృతాన్ని గోరు వెచ్చని నీటిలో గాని పాలల్లో గాని కలిపి చిన్నారులకు తాపించాలన్నారు.బాలమృతాన్ని పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు చంద్రమతి, ఇందిర, ప్రమీల పాల్గొన్నారు.

కాగిత ప్రశాంత్‌కు ఉత్తమ పురస్కారం

విశాలాంధ్ర - బాపట్ల : విశాలాంధ్ర దినపత్రిక బాపట్ల జిల్లా బ్యూరో కాగిత ప్రశాంత్ రాజుకు విశ్లేషణాత్మక జర్నలిజం విభాగంలో ఉత్తమ జర్నలిస్టుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన తెలుగు జర్నలిస్టుల ఉగాది పురస్కారాల్లో ప్రశాంత్ రాజుకు విశ్లేషణాత్మక జర్నలిజం విభాగంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాని న్యాయమూర్తి ఎన్.వి రమణ చేతుల మీదుగా మెమొంటో ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ప్రశాంత్‌కు అభినందనలు తెలిపారు.ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ రంగంలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో 100 మంది ఉత్తమ జర్నలిస్టులను ఎంపిక చేయగా వీరిలో ప్రశాంత్ రాజు ఉండటం గర్వకారణం అని పలువురు అభిప్రాయపడ్డారు.కాగిత ప్రశాంత్ రాజును దృశ్యాలతో సన్మానించి మేమంటూ ప్రశంసా పత్రం ప్రోత్సాహ నగదును అందజేశారు.సన్మానించిన వారిలో సుప్రీంకోర్టు మాజీ నాయమూర్తి ఎన్.వి రమణ,ప్రముఖ సినీ నిర్మాత ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు,తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు,అబ్ స్టా దర్బార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నిజాం బాబా తదితరులు ఉన్నారు.

15 నుంచి జూన్ 14వరకు చేపల వేట నిషేధం

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 15 నుండి జూన్ 14వ తేది వరకు సముద్ర జలాలలో చేపల వేట నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి కె.శ్రీనివాస్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.చేప,రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు,తల్లి రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం తద్వారా మత్స్య సంపద సుస్థిరత సాధించడంతో పాటు మత్స్యకారుల జీవనం అభివృద్ధి చేసుకునేందుకు గాను ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు. ఈ వేట నిషేధ కాలంలో మత్స్యకారులు సముద్రంలో మర,మోటారు (యాంత్రిక) పడవల ద్వారా చేపల వేటకు వెళ్లరాదని ఆదేశించారు.ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లగించిన వారిపై ఏపీఎంఎఫ్ఆం చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోని,వారికి ప్రభుత్వ రాయితీలు నిలుపుదల చేయబడునని తెలిపారు.

ఘనంగా ఈర్ల గంగమ్మ తిరునాళ్ల మహోత్సవం

విశాలాంధ్ర-బల్లికురవ : మండలలోని నక్కబొక్కల పాడు పంచాయతీ పరిధిలో వెలసి భక్తుల పాలిట కొంగు బంగారమై భాసిల్లుతున్న భక్తుల కోరికలు తీర్చే ఈర్ల గంగమ్మ 68వ వార్షిక తిరునాళ్ల మహో త్సవం శనివారం నక్కబొక్కలపాడు ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహిం చారు. వేకువజాము నుండి చుట్టుపక్కల గ్రామాలు, పక్క జిల్లాలను నుండి భక్తులు భారీగా తరలి వెళ్లి పొంగల్ పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిరుణాల మహో త్సవ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక బందో బస్తు ఏర్పాటు చేయా లని పోలీస్ శాఖను ఆదేశిం చారు. స్థానిక ఈర్ల కొండ వద్ద వేంచేసియున్న గంగమ్మ తల్లి ఆలయా నికి ఘనమైన చరిత్ర ఉంది.ఆదే విధంగా ఆలయం వద్ద ఆచార బొల్లావుల ప్రాముఖ్యతను కూడా ప్రత్యేకంగా పేర్కొన్నారు.ఇక్కడ నుండే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్టీల్‌గ్రే గ్రానైట్‌క్వారీలు ఉన్నాయి. గ్రానైట్ క్వారీ యాజమాన్యం కార్మికులు అమ్మ వారిని దర్శించుకుంటే క్వారీలలో ఎలాంటి ప్రమా దాలు జరగమని నమ్మకంతో నిత్యం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తూ ఉంటారు. తిరునాళ్ల పురస్కరించుకొని టీడీపీ ఆధ్వర్యంలో 5 భారీ విద్యుత్ ప్రబలను ఏర్పాటు చేశారు.ఆలయ పరిసరాల్లో అన్నదాన కార్యక్రమాలు ఉదయం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈర్ల గంగమ్మ ఆలయం మూలవిరాట్టుభక్తులు బంగారు నగలను సమర్పించడంతో ప్రత్యేకంగా అలంకరిం చారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా డిఎస్పి రామాంజనేయులు ఆధ్వర్యంలో,2 సీఐలు,6 మంది ఎస్ఐలు,100 మంది పోలీసు సిబ్బంది భద్రతా కార్యక్రమాలను పర్యవేక్షించారు.ఎస్ ఐ నాగరాజు ప్రత్యేకంగా గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ చూపారు.

15 నుంచి చేపల వేట నిషేధం

విశాలాంధ్ర - నిజాంపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 15 నుండి జూన్ 14వ తేదీ వరకు (61 రోజుల పాటు) సముద్ర జలాలలో చేపల వేట నిషేధిస్తున్నట్లు నిజాంపట్నం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి.సాయి సందీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.చేప, రొయ్యల జాతులు సంతా నోత్పత్తి కాలంలో తల్లి చేపలు,తల్లి రొయ్యలను సంరక్షించడం,వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం తద్వారా మత్స్య సంపద సుస్థిరత సాధించడం తోపాటు మత్స్యకారుల జీవనం అభివృద్ధి చేసుకునేందుకు గాను ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు.ఈ వేట నిషేధ కాలంలో మత్స్యకారులు సముద్రంలో మర,మోటారు (యాంత్రిక) పడవల ద్వారా చేపల వేటకు వెళ్లరాదన్నారు.నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి సముద్రంలో చేపల వేట చేస్తే బోట్ల యజమానులకు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం ఏపీఎంఎఫ్ఆర్ యాక్టు-1994,సెక్షన్-4ను అనుసరించి శిక్షార్హులని చెప్పారు. అట్టి వారి బోట్లను అలాగే బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీనం చేసుకో వడమే కాక జరిమానా విధిస్తూ డిజిల్ ఆయిల్ రాయితీ,ప్రభుత్వం అందించే అన్ని రాయితీ సౌకర్యాలను నిలిపివేయడం జరుగుతుందన్నారు.ఈ వేట నిషేధం సక్రమంగా అమలయ్యేందుకు మత్స్యశాఖ,కోస్ట్ గార్డ్,కోస్టల్ సెక్యూ రిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ వేట నిషేధం అమలుకు మత్స్యకారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

రాయల్ కాలేజ్ విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర-మార్టూరు : ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక రాయల్ కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి, మండల స్థాయిలో విజయ కేతనం ఎగుర వేశారు.సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థుల 1000 మార్కులకు ఓబులశెట్టి దిలీప్ 989,పి.లక్ష్మి శరణ్య 976,పీ.దేవిశ్రీ 973 మార్కులు సాధిం చారని కళాశాల డైరెక్టర్ వీరగ్రంధం శ్రీనివాస్ తెలి పారు. 900పైగా మార్కులు సాధించిన వారు 23,సీనియర్ సిఈసిలో 1000 మార్కులకు బద్దిటి అనూహ్య 964,డి రామలక్ష్మి 923,సీనియర్ బైపీసీలో బి.సౌమ్యశ్రీ 940/1000,షేక్ సమీరా 938,కే.శ్రీలక్ష్మి 925, జూనియర్ ఇంటర్‌లో 470కి,ఎం.సాయి భవ్యశ్రీ 464, జి.చందన 460, పి.హశ్వేషీ 458,ఎన్.అఖిల్ 457,ఎం.రోషిని 454,జూనియర్ సిఈసిలో షేక్ నబి 458/500,కె.మేర 428,బి.సిరివెన్నెల 426, జూనియర్ బైపీసీలో బి.బ్యులా 414/440, జె నాగ చైతన్య 407, జె.ప్రిన్సి 403 సాధించార న్నారు. ఉత్తమ ఫలితాలను అందించిన కళాశాల విద్యార్థులను ప్రిన్సి పాల్ రావి అంకమ్మచౌదరి, కళాశాలఅధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

విజ్ఞాన్ ఒకేషనల్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - రేపల్లె : బాపట్ల జిల్లా రేపల్లెలోని విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఇంటర్ ప్రథమ ఫలితాలలో విద్యార్థిని,విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించి బాపట్ల జిల్లాలో అగ్రస్థానంలో విజయకేతనం ఎగుర వేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ సాజిద్ భాషా తెలిపారు.ఇంటర్ మొదటి సంవత్సరం నర్సింగ్ గ్రూపు ఫలితాలలో ప్రథమ స్థానం 500కు 465 మార్కులు శ్రావణి,వైశాలి సాధించార న్నారు. ద్వితీయస్థానంలో భవాని, 500కు 458 మార్కులు సాధించగా మొదటి సంవత్సరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌లో ప్రథమ స్థానం పార్వతి 500కు 453 మార్కులు, ద్వితీయ స్థానం హారిక,కృష్ణ 500కు 447 మార్కులు, ఇంటర్ రెండవ సంవత్సరం ల్యాబ్ టెక్నీషియన్ గ్రూపులో ప్రథమస్థానం 1000 మార్కు లకు 957 హారిక,ద్వితీయ స్థానం 1000 మార్కులకు 923 మార్కులు అనూ షలు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం నర్సింగ్ గ్రూపులో ప్రథమ స్థాన ంలో పావన లక్ష్మి 1000 మార్కులకు 925, ద్వితీయ స్థానంలో పద్మ 1000 మార్కులకు 855 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సాజిద్ భాషా తెలిపారు.ఇంటర్ మొదటి రెండుసంవత్సరాల్లో ఎక్కువ శాతం విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించి సునామి సృష్టించారని ఆయన విద్యార్థులకు యాజమాన్యానికి అధ్యాపక బృందానికి రేపల్లె ప్రెస్ క్లబ్,రేపల్లె తాలూకా ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ సమైక్య కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు : ఎస్సై

విశాలాంధ్ర-ముండ్లమూరు : వాహన దారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కే కమలాకర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా దర్శి అద్దంకి ప్రధాన రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనం నడప రాదన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తలకు హెల్మెట్ పెట్టుకోవాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని ఆయన తెలియజేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు వాహనం ఇచ్చినా, చిన్నారులకు వాహనం ఇచ్చిన వారు పట్టుబడితే అందుకు పూర్తి బాధ్యత వాహన యజమానిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన విద్యా కుసుమాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థిని విద్యార్థులు విజయ దుందుభి మోగించారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కే పూర్ణచంద్రరావు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ ఏ సునీత తెలిపారు. జూనియర్ ఇంటర్మీడియట్లో బైపీసీలో చావల కావ్య440 మార్కులకు గాను 422 మార్కులు సాధించింది. రెండవ సంవత్సర ఇంటర్మీడియట్లో ఎంపీసీ గ్రూపులో నాని 1000 మార్కు లకు గాను943 సాధించాడు. రెండవ సంవత్సర ఇంట ర్మీడియట్ బైపిసిలో గండి లావణ్య 1000 మార్కు లకు గాను945 మార్కులు సాధించింది. అదేవిధంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మొదటి సంవత్స రంలో 52% శాతం మార్కులతో పాసయ్యారు. స్నేహ మాధురి 391 మార్కులు వచ్చాయి. ఇంటర్ రెండవ సంవత్సరంలో 33.3% మంది పాస య్యారు. కే సుసన్న 704 మార్కులు సాధించింది.

స్టేట్ టాపర్‌గా యశ్వంత్ నాయక్

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని బురుజుపల్లె తండాకు చెందిన బుక్కే యశ్వంత్ నాయక్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అద్వితీయమైన ప్రతిభను కనపరచి స్టేట్ టాపర్‌గా నిలిచారు. విజయవాడలోని శ్రీ చైతన్య ఐఐటి- జేఈఈ అకాడమీ (రామన్ భవన్)లో యశ్వంత్ ఇంటర్మీడియట్ చదువు తున్నారు. ఎం.పి .సి లో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. యశ్వంత్ తండ్రి బుక్కే కృష్ణ నాయక్ కొమరోలు మండలం గుంతపల్లి ఎం. పి.పి పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. తల్లి మంగమ్మ గిద్దలూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆఫీసు సబార్డినేటర్‌గా పనిచేస్తున్నారు. గిద్దలూరు ప్రాంతానికి చెందిన యశ్వంత్ స్టేట్ టాపర్‌గా ప్రతిభను చాటడంతో అభినందనలు వ్యక్తం అవుతున్నాయి.

కేజీబీవీ కాలేజీలో 100% ఉత్తీర్ణత

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక కేజీబీవీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఎం ఎల్ టి గ్రూప్ నందు ద్వితీయ సంవత్సరము 25 మందికి గాను 25 మంది విద్యార్థినిలు పరీక్షలు రాసి ఉత్తీర్ణత 100% సాధించారని ఎస్ఓ పద్మావతి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. షేక్ నౌ షియా 1000/960 మార్కులు టి నందిని 1000/948 మార్కులు సాధించారని మొదటి సంవత్స రంలో 32 మంది గాను 30 మంది ఉత్తీర్ణత సాధించారు షేక్ మెహరున్నీసా 500/479 మార్కులు గజ్జల నాగమల్లేశ్వరి 500/479 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ అభినందించారు.

గంజాయి, మద్యం సేవిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-పామూరు : బహిరంగ ప్రదేశాలలో నిషేధిత గంజాయి, మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కిషోర్ బాబు హెచ్చరించారు. శని వారం పట్టణంలోని పలు బహిరంగ ప్రదేశాలలో ఉన్న యువకులకు ఎస్ఐ కిషోర్ బాబు తమ సిబ్బందితో వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. జూదం, ఆన్లైన్ గేములు, బెట్టింగులతో జీవితాలను నాశనం చేసుకొని, తల్లిదండ్రులకు శోభ పెట్టరాదని సూచనలు సలహాలు ఇచ్చారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ కంటపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గాలివాన బీభత్సం

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలో శని వారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు నేల కొరిగాయి. ఇదే సమయంలో భారీ వర్షం మొదలైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసి ంది. మూడు గంటల నుంచి క్రమేణా వాతావరణం మారిపోయి ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. 3.30 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో గాలి వాన మొదలైంది కొద్దిసేపట్లోనే వర్షం మొద లైంది. సుమారు గంటపాటు వర్షం కురిసింది. ఈదురు గాలులు వీచడం మొదలైన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. వర్షం పూర్తిగా తగ్గిన తరువాత ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అకాల వర్షంతో పలు గ్రామాలలో పంటలు తడిసి ముద్ద య్యాయి. రైతులు కల్లాలలో ఆరబెట్టుకున్న మిర్చితడిసి ముద్దైంది. బీభత్సంగా ఈదురుగాలులు తోలడంతో పొగాకు బ్యారన్‌లు ఇళ్లపై రేకులు ఎగిసిపడడంతో ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

లోక కళ్యాణార్థం గాయత్రి మాత యజ్ఞం నిర్వహణ

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఆవరణమునందు గాయత్రి మాత యజ్ఞం విశ్వావసు నామ సంవత్సరం మొదటి పౌర్ణమి రోజున అత్యంత వైభవంగా గాయత్రి మాత యజ్ఞం పూనూరు హనుమంతరెడ్డి దంపతులు వంగల ప్రసూన అమ్మయ్య నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పౌర్ణమికి అమావాస్యకి అతీతమైన శక్తులు ఉంటాయన్నారు మానవులు యజ్ఞం చేయటం వలన కర్మలు తొలగి మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తూ ఈ యజ్ఞం యాగాలు నిర్వహిస్తూ ఉంటామన్నారు వ్యక్తిలోనూ మనసు మార్పు సమాజంలోనూ చైతన్య వంతులై మంచి మనసు బుద్ధి కలుగుతుందన్నారు. అందుకోసమే ప్రతి అమావాస్యకి పౌర్ణానికి పుట్టినరోజులకు అడిగిన సమయాల్లో గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తుంటామని వారు తెలిపారు. పూర్వపు రోజులలో పాండవులు అమావాస్య రోజు యజ్ఞ యాగాలు చేసి ఏదైనా కార్యక్రమాలు మొదలుపెట్టేవారని తెలిపారు యజ్ఞంలో పాల్గొన్న భక్తాదులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు విశ్రాంత లెక్చరర్ వడ్డే వీరారెడ్డి లాయర్ అంజనీకుమార్ నారాయణమ్మ విశ్రాంత బిఎస్ఎన్ఎల్ అధికారి పోలయ్య గాయత్రి మాత భక్తులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాగునీటి చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని నగర పంచాయతీ కార్యా లయం వద్ద, కుమ్మరాం కట్ట, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాలను గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవి కాలం కావడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నగర పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో గిద్దలూరు నియోజకవర్గంలో అధిక ఉష్ణోగ్రతల నమోదు అవుతున్నాయని ప్రజలు తప్పనిసరిగా తాగునీరు ఎక్కువగా తాగాలని, ప్రయాణికులు, ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముఖ్యంగా వృద్ధులు ఈ వేసవిలో సాయంత్రం వేళా బయటకు రావాలని సూచించారు. గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్, పట్టణ అధ్యక్షులు, నగర పంచాయతీ కమిషనర్, పట్టణ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అన్నాను సన్మానించిన మేడా బద్రీనాథ్

విశాలాంధ్ర-మార్కాపురం : మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా రాంబా బును ఆ పార్టీ ఇంటలెక్చు వల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మేడా బద్రి నాథ్ శనివారం ఉదయం ఆయనను వారి నివాసంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొ రేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్‌లకు బద్రీనాథ్ శాలువ కప్పి సన్మానించారు. మేడా బద్రినాథ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలను, లక్ష్యాలను మేధావి వర్గంలోకి, ముఖ్యంగా ప్రజలలోకి తీసుకెళ్ళేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సలహాలు, సూచనలతో ఇంటలెక్చువల్ రాష్ట్రవిభాగం శాయశక్తుల కృషి చేయడం జరుగుతుందన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన అప్పిశెట్టి

విశాలాంధ్ర-గిద్దలూరు : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఒంగోలుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి దృష్టికి గిద్దలూరు పట్టణంలోని పలు సమస్యలపై మంత్రితో చర్చించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరి హర క్షేత్రంలో మహా పూర్ణాహుతి

- మహా పూర్ణాహుతి కుంభాభిషేకంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యులు
- ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్



విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి శ్రీహరి హర క్షేత్రంలో మాజీ మంత్రి సిద్ద రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సిద్ద రాఘవరావు దంప తులు సిద్ద పాండురంగారావు దంపతులు వారి కుటుంబ సభ్యులు ఆధ్వ ర్యంలో 19వ వార్డులో అత్యంత వైభవంగా ముగిశాయి. శనివారం ఉదయం ఆలయంలో వేంచేసి ఉన్న సర్వదేవతలకు విశేషాలు అభిషేకాలు విశేష పూజలు ఆగమ విశారద కృష్ణ శర్మ బృందంకి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు శిద్దా పాండు రంగారావు దంపతులు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. 19వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విలువైన కానుకలు అందజేసి రాష్ట్ర శిద్దా రాఘవరావు శ్రీమతి లక్ష్మీ పద్మావతి దంపతులు ఈ సందర్భంగా సువర్ణ హృదయ లక్ష్మీదేవి హృదయ భూదేవి బంగారు ఆభరణం మరియు రజిత సువర్ణ దారల్ తో కూడిన యజ్ఞోపవీతం కానుకగా శిద్దా రాఘవ దంపతులు స్వామి వారికి అందజేశారు. గత రెండు రోజులుగా జరుగుతున్న నిత్య హోమాలు మూలమంత్ర హోమం కళాన్యాస హోమాలతో శ్రీహరి హరికథ ఆధ్యాత్మిక వాతావరణ నెలకొంది. సంత నూతలపాడు శాసనసభ్యులు గౌరవ బి.ఎన్.విజయ్ కుమార్ ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాసనసభ్యులు స్వామివారి విశేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం వేద పండితులు శిద్దా కుటుంబ సభ్యులకు ఆశీర్వా దాలతో పాటు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు శిద్దా వెంకటేశ్వర్లు వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు భోజన సదుపాయాలు కల్పించారు. సాయంత్రం జరిగిన శ్రీ హరి క్షేత్ర సర్వదేవతల నృత్యం నైనానందకరంగా సాగింది నగరోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శిద్దా కుటుంబ సభ్యులు గ్రానైట్ రంగాలకు చెందిన ప్రముఖులు దర్శి,ఒంగోలు, కందుకూరు, మార్కాపురం కు చెందిన ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ స్థావరంపై దాడి

- 100 లీటర్ల బెల్లం ఊట,10 లీటర్ల నాటు సారాను స్వాధీనం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నాటు సారా తయారీ స్థావరం పై దాడులు నిర్వహించామని నగరం ప్రొహిబిషన్,ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీరామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఒంగోలు ప్రొహిబిషన్,ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వారి ఆదేశాల మేరకు శనివారం మండలంలో దిండి పంచాయతీ పరిధిలో దాడులు నిర్వహించగా జంపనవారిపాలెం గ్రామంలోని ఉత్తర దిక్కున 100 మీటర్ల దూరంలో ఉన్న తాటితోపు వద్ద 100 లీటర్ల బెల్లం ఊట,10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారు చేసిన, అమ్మకాలు జరిపిన అట్టి వారిపై కేసులు నమోదు చేస్తామని అయన హెచ్చరించారు. ఈ దాడిలో ఒంగోలు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఎస్.రామారావు,సబ్-ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, బాపట్ల ఈఎస్టీఎఫ్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, రేపల్లె ప్రొహిబిషన్,ఎక్సైజ్

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఐటీ అండ్ ఎల్కట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశా లతో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేప ల్లిలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కూటమి నాయకులు శనివారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. 12వ వార్డులో అద్దంకి చంద్రశేఖరరావుకి రూ.91,151 చెక్కు అలాగే 13వ వార్డు చెందిన మేకల పూజకి రూ.1,10,000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు అధ్యక్షులు షేక్ దుబాయ్ మస్తాన్, 13వ వార్డు అధ్యక్షుడు కాకమాను కుమార్, మంగళగిరి మైనార్టీ కమిటీ నాయకులు షేక్.సైదా, పట్టణ మైనార్టీ నాయకులు ఇంతియాజ్, మైనార్టీ అధ్యక్షుడు షేక్. చాంద్‌భాషా, పట్టణ కార్య నిర్వహణ కార్యదర్శి శక్కూలురు శ్రీను, షేక్.బాజీ, ఈమని శివనాగేశ్వరరావు, బబ్లు, శీను, తదితరులు పాల్గొన్నారు.

13న చంద్రశేఖరరావు జయంతి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : డాక్టర్ వి.చంద్రశేఖర రావు జయంతి-పురస్కార సభ ఈ నెల 13న సాయంత్రం 6 గంటకు గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం కొరటాల భవన్‌లో జరుగుతుందని డాక్టర్ వి.ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు. కలుంకూరి గుట్ట కథాసంపుటి వెలువరించి తెలుగు కథకు కొత్త చేర్పును అందించిన యువ కథాకెరటం కేవీ మేఘనాథ్ రెడ్డి ఈ పురస్కారం అందుకోబోతున్నారని చెప్పారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించే ఈ సభలో ఏకే ప్రభాకర్, వాసిరెడ్డి నవీన్, కందిమళ్ళ శివప్రసాద్, కాత్రగడ్డ దయానంద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-తాడికొండ : ఈ నెల 14న పొన్నెకల్లు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి జరగ నుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సభా ప్రాంగణం, హెలిపాడ్, అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జేసీ భార్గవ తేజ శనివారం సంద ర్శించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎస్పీ నాగ సాయికుమార్, డీఎల్పీఓ కందిమల్ల శ్రీనివాసరావు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.సమతా వాణి తదితరులు పాల్గొన్నారు.

'భూమన' అసత్య ప్రచారం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అదో నల్లరాయి.. దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ' గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నార న్నారు. కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, ఏడుకొండలను 5 కొండలుగా మార్చి కుట్ర చేసింది, టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చే చర్యలకు పాల్ప డింది నువ్వు కాదా?అని ప్రశ్నించారు. చేసిన తప్పుడు పనులకు విధుల దూరం అయిన హరినాధ్ రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీ పై తప్పుడు ప్రచారాలు చేస్తారా?మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అన్ని ఈ సందర్భంగా జనార్దన్ మీడియాకు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో వీజే విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-మంగళగిరి : ఇంటర్ పరీక్షా ఫలితాలలో వీజే జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధిం చారని కళాశాల సెక్రటరీ, కర స్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో జొన్నాదుల వెంక ట నాగ అమృత 987 మార్కులతో ప్రథమ స్థానాన్ని, వెనిగళ్ళ అనూష 980 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, బైపీసీ విభాగంలో పి.వెంకట శార దాంబ 949 మార్కులతో ప్రథమ స్థానాన్ని, ఎస్.చరణ్ తేజ 945 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, జి.వెం కట సాయి లోకేష్ 945 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, ఎంఈసీ విభా గంలో కె.కీర్తి నాగసాయి 947 మార్కు లతో ప్రథమ స్థానాన్ని, టి.శ్రీకర్ ఆనంద్ 905 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, హెచ్ఈసీ విభాగంలో జి.రమ్య 959 మార్కులతో ప్రథమ స్థానాన్ని, సీఈసీ విభాగంలో బి.ప్రవ ల్లిక 963 మార్కులతో ప్రథమ స్థానా న్ని, డి.ఆశ్రిత 848 మార్కులతో ద్వితీ య స్థానాన్ని సాధించినట్లుగా తెలి పారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎన్.బిందు పల్లవి 464 మార్కులతో ప్రథమ స్థానాన్ని, వి.హాసిని 460 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, బైపీసీ విభాగంలో కె.వెంకట నాగ హేమ సాయి 427 మార్కులతో ప్రథమ స్థానాన్ని, ఎన్.శ్రీ ఉపేంద్ర 424 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, ఎంఈసీ విభాగంలో ఏ.రాకేష్ సాయి తేజ 480 మార్కులతో ప్రథమ స్థానా న్ని, సిహెచ్ భువనలక్ష్మి 476 మార్కు లతో ద్వితీయ స్థానాన్ని, సీఈసీ విభా గంలో కె.చరణ్య 471 మార్కులతో ప్రథమ స్థానాన్ని, కె.జయశ్రీ 466 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందా రని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికి, తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపల్ అవ్వారి సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ జి.లక్ష్మి అభినందనలు తెలియజేశారు.

అంకితభావంతో పని చేయాలి: పీఆర్కే

విశాలాంధ్ర-రెంటచింతల: మండలం లోని వివిధ గ్రామాలలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పార్టీ బలోపేతానికి నూతన మండల కమిటీ అంకితభావంతో కృషి చేయా లని పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల నూతన కమిటీ అధ్యక్షులు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, సభ్యులుగా ఎన్నికైన వారు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ వైస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాజకీయ పార్టీ లకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాలను అంద చేయగా ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ పేరిట పేద ప్రజలందరినీ మోసం చేసిన విషయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఒక్క అవకాశం ఇస్తే మీ కుటుంబాలకు మేలుచేస్తానని చెప్పిన అప్పటి సీఎం జగన్ అన్నమాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వారి జీవితాలలో కొత్త వెలుగులు తీసుకువచ్చారని గుర్తు చేయాలన్నారు. జగనన్న పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను గెలి పించుకుందామని ప్రజలను చైతన్యవం తులను చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు కొమ్మా రెడ్డి మర్రెడ్డి,యేరువ షో రెడ్డి,పి. సంపూర్ణమ్మ, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చల్లా మట్టారెడ్డి, ఏరువ శౌరెడ్డి, శీలం అంజయ్య, కె. మర్రెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధి పేరుతో సాగు భూములు కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు కార్పొరేట్లకు స్వాధీనపరచిన వైనంపై రాష్ట్ర ప్రభుత్వం నిగ్గుతేల్చా లని, ఈ 25 ఏళ్ల కాలంలో ఎన్ని పరిశ్రమలు స్థాపించారు? ఎంతమంది ఉద్యోగాలు పొందారు? స్థానికులు ఎంతమందికి ఉద్యోగాలు దక్కాయో ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా పార్టీ ప్లీనంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఆయన సుందరయ్య భవనం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు,జివి కొండారెడ్డి పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎండూరి నాగరాజు

విశాలాంధ్ర-దుర్గి: ఎంఆర్పీఎస్ మండల నూతన అధ్యక్షుడుగా దుర్గి గ్రామానికి చెందిన ఎండూరి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం కారంపూడి గ్రామంలో జరిగింది. ముఖ్య అతిథులు ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు అద్దంకి బాబు మాదిగ విచ్చేశారు. ఈ సమావేశంలో మాచర్ల నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అధ్యక్షులను నియమించారు. దుర్గి మండలం ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షునిగా ఎండూరి నాగరాజ్ మాదిగ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దుర్గి మండలం ఎంఆర్పిఎస్ అధ్యక్షునిగా ఎన్నికైన నాగరాజు మాదిగ గారికి దుర్గి మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.